ప్రజలకు అవగాహన కల్పించాలి

- నేరాల నియంత్రణలో అప్రమత్తంగా ఉండాలి
- పోలీసులకు డీఎస్పీల సూచనలు
- స్టేషన్లలో తనిఖీలు


గుండాల: సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

గుండాల: ఆదివాసీల అభివృద్ధికి అడ్డుకట్ట వేసే నక్సలైట్లకు సహకరించకుండా గ్రామాలలో అవగాహన కల్పించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను స్థానిక పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం గుండాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ రికార్డ్స్, నేరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సంబంధించిన కిట్ బ్యాగ్స్, మెడికల్ బుక్స్, స్మాల్ సర్వీస్ బుక్స్‌ను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఫిర్యాదులు ఇచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, నేరస్తులతో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. నక్సల్స్‌పై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని తెలిపారు. ఆయన వెంట సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: నేరాల నియంత్రణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. నమోదౌతున్న కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఎస్సైలు యయాతి రాజు, శివరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే


గండుగులపల్లి క్యాంప్ కార్యాలయంలో ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మోచేతి శస్త్ర చికిత్సకు అవసరమైన లక్ష రూపాయల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం అందజేశారు. మండలంలోని పార్కలగండి గ్రామానికి చెందిన కొండ్రు వెంకటేష్‌కు, మోచేతికి శస్త్ర చికిత్స నిమిత్తం హైదారాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో లక్ష రూపాయలు అవసరం కాగా, బాధితుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జారే ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే లక్ష రూపాయల ఎల్‌ఓసీను మంజూరు చేయించి, బాధితుడి కుటుంబ సభ్యులకు గండుగులపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. అంతకు ముందుగా క్యాంప్ కారాల్యయంలో ఎమ్మెల్యేను పలువురు సమస్యలపై కలవగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం, పీఓ రాహుల్

మణుగూరుటౌన్: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పుస్తకాల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి మాట్లాడారు. తాను మణుగూరులో చదువుకున్నప్పుడు ఇన్ని సౌకర్యాలు లేవని, ఆ రోజులను చూసిన అంశాలను గుర్తు చేసేకుని డిగ్రీ కళాశాల, ఐటీఐ వంటి కళాశాల ఏర్పాటుకు కృషి చేశానని అన్నారు. ఏజెన్సీ విద్యార్థులకు ఈ రోజు సాంకేతికత అభివృద్ధి చెంది హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు అన్ని రకాల కాయగూరలతో కూడిన భోజన సదుపాయాలు ఉన్నాయన్నారు. కళాశాలలోని పలు సమస్యలు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే, పీఓలను అధ్యాపకులు, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవో డేవిడ్ రాజు, తహసీల్దార్ రాఘవరెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగముణి నాయక్, నాగేశ్వర రావు చారి, ఎంపీడీఓ శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ


మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులు అందిస్తున్న ఐటీసీ ఉన్నతాధికారులు

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం మెరిట్ స్కాలర్ షిప్‌లను అందజేశారు. ఐటీసీ పీఎస్‌పీడీలోని సర్వీస్ ప్రొవైడర్ ఉద్యోగుల పిల్లల ఉన్నత చదువులకు ఈ ప్రతిభ పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ శైలేంద్రసింగ్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌ల పంపిణీని అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు డీవీఎం నాయుడు, కార్యదర్శి సాయిరామ్, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్ కిరణ్, జేకే దాస్, డేవిడ్ అలివర్, రంజిత్, చాంద్‌బాషా, చెంగలరావు, అల్క, శ్రీలత, శైలజ,పాకాల దుర్గాప్రసాద్,య వెంకటరావు, బసప్ప రమేష్, ఏసుబు,రామకృష్ణ, ఉమామహేశ్వరి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త గనులు ఏర్పాటు చేయాలి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో కొత్తగనులు ప్రారంభించాలని కోరుతూ ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా ఆధ్వర్యంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజ్ ఇన్ డైరెక్టర్ బలరాం, కో–ఆర్డినేషన్ సయ్యద్ మెహబూబ్‌కి వినతిపత్రం అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆయన అధికారులతో మాట్లాడుతూ.. ఆగస్టు 13న గోదావరిఖనిలో మాదిరిగా మణుగూరులో గనుల విస్తరణకు అనుమతులు తేవాలని కోరారు. మణుగూరులోనూ కార్మిక సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు గ్రీవెన్స్‌డే ఏర్పాటు చేయాలని కోరారు. ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల ప్రక్రియలో జాప్యాన్ని నివారించి అర్హులైన ఆపరేటర్లకు సీ, బీ,ఏ స్పెషల్ గ్రేడ్ పదోన్నతుల ఖాళీలు సత్వరమే భర్తీ చేయాలన్నారు. కారుణ్య నియామక డిపెండెంట్‌ల పది మెమో జెన్యూనిటీ ప్రక్రియ హైదరాబాద్ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డులో తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రత్యామ్నాయ పరిష్కార మార్గం చూడాలన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన బలరాం నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేలం ఖరారు

చర్ల: మండలంలోని పెద్దిపల్లి గ్రామపంచాయతీ పరిధి జెట్టిగూడెం, మణుగూరు మండలంలోని సింగారం మధ్య గోదావరి నదిలో పడవ నడిపే వేలం ఖరారైంది. ఈ మేరకు శనివారం నిర్వహించిన వేలం రూ 6.88 లక్షలకు జెట్టిగూడెంకు చెందిన కనితి శ్రీనివాసరావు దక్కించుకున్నారు. 2025 మార్చి వరకు ఆయనకు అనుమతి ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, పంచాయితీ కార్యదర్శి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట బీసీ గురుకులంలో పనిచేసిన ఉపాధ్యాయురాలు లావణ్య ఆ ఆ పాఠశాలకు తోడ్పడేందుకు రూ.10 వేలను విరాళంగా అందజేశారు. ఇన్నాళ్లూ ఇక్కడ పీజీటీగా విధులు నిర్వహించిన లావణ్య.. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. తాను పనిచేసిన పాఠశాల అభివృద్ధికి ఇతోధికంగా సాయమందించిన లావణ్యను ప్రిన్సిపాల్ నిరోషా, సిబ్బంది అభినందించారు. దుశ్శాలువతో ఆత్మీయంగా సత్కరించారు. ఉపాధ్యాయురాలు గతంలోనూ పలుమార్లు విరాళాలు అందించారు.

రోడ్డు మరమ్మతులు చేయించిన తహసీల్దార్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల తహసీల్దార్ అశోక్ కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏటపాక మండలం లోని సీతంపేట గ్రామంలోని చర్ల–భద్రాచలం రహదారిని మరమ్మతులు చేయించారు. మన రాష్ట్రం కాకపోయినప్పటికీ చర్ల భద్రాచలం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఆయన స్పందించి గ్రావెల్‌తో మరమ్మతు చేయించారు. స్పందించి మరమ్మతులకు చర్యలు చేపట్టడంపై స్థానికులు అభినందనలు తెలిపారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెన్నూరి సంపత్ నాయనమ్మ ముత్తమ్మ ఇటీవల మృతి చెందగా శనివారం దశదిన కర్మ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముత్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మద్రి మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్ ముత్తమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

చీరల పంపిణీలో గందరగోళం


పూసుగూడెం జీపీ కార్యాలయం వద్ద భారీగా గుమికూడిన మహిళలు

ములకలపల్లి: బతుకమ్మ చీరల పంపిణీలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా సుమారు 16 వేల మంది మహిళా ఓటర్లు ఉండగా, మండలానికి కేవలం 7,800 చీరెలు మాత్రమే వచ్చాయి. ఈ క్రమంలో శనివారం పూసుగుడెం జీపీ కార్యాలయంలో చీరల పంపిణీ చేపట్టగా.. స్థానిక మహిళలు అడ్డుకున్నారు. మహిళా సంఘ సభ్యులకు మాత్రమే బతుకమ్మ చీరలు వచ్చాయని సంబంధిత బాధ్యులు వివరించగా.. తమకు కూడా ఇవ్వాలని పట్టుబట్టారు. అందరికీ చీరలు ఇవ్వలేని పక్షంలో నిలిపివేయాలని భీష్మించారు. ఈ క్రమంలో కొన్ని చీరలను పంపిణీ చేసిన సిబ్బంది గత్యంతరంలేని పరిస్థితుల్లో వెనుతిరిగి వెళ్లారు. ఈవిషయమై తహసీల్దార్ పుల్లారావును వివరణ కోరగా తొలివిడతగా మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే చీరలు వచ్చాయని తెలిపారు. మలివిడతలో మహిళలందరికీ పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

న్యాయమూర్తికి సన్మానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తిగా విధులు నిర్వహించి ఇటీవల సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది వికారాబాద్‌కు బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లును శనివారం భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి, ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో న్యాయమూర్తి వెంకటేశ్వర్లుని ఆదివాసీ న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వంశీకి అభినందన


వంశీని అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడయ మోడెం వంశీ, జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డి, జిల్లా పవర్ లిఫ్టింగ్ సభ్యులైన వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజీలను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శనివారం అభినందించారు. కొత్తగూడెంలోకి కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించడాన్ని అభినందించారు.

మొక్కలు నాటిన వృక్షమిత్ర


పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న వృక్షమిత్ర చౌహాన్

చంద్రుగొండ: మండలంలోని గుర్రాయిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వృక్షమిత్రగా పేరొందిన చౌహాన్ శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటాడు. చండ్రుపల్లి మండలం హౌసింగ్‌బోర్డుకు చెందిన ఈ బాలుడు పర్యావరణ ప్రేమికుడు. చిన్న వయస్సులోనే వేలాది మొక్కలు నాటి రాష్ట్రంలోని ప్రముఖులతో షబాష్ అనిపించుకున్నాడు. వృక్షమిత్రకు ఉపాధ్యాయురాళ్లు ప్రవీణ, కృష్ణకుమారి సన్మానించారు.

'డీటీసీఎల్' విజేత రఘు లెవన్


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గ ఆటగాళ్లతో నిర్వహించిన దుమ్ముగూడెం టాలెంట్ క్రికెట్ లీగ్(టీడీసీఎల్) టోర్నమెంట్‌లో రఘు లెవన్ జట్టు విజేతగా నిలిచింది. ఈమేరకు శనివారం జరిగిన సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు లంక అబ్బులు, పిలక వెంకటరమణారెడ్డి, గడ్డం బాలాజీ, మట్టా శివాజీ, కొమ్ము రంజిత్, టోర్నీ నిర్వాహకులు తెల్లం హరి, రఘు, సుమన్, రేసు శ్రీను పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

అన్నపురెడ్డిపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని జానకీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు గ్రామాల్లో ఇప్పటికే వరి పంటలు కోతలకు వచ్చియని, ప్రభుత్వం తక్షణమే గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, సోమరాజు, లింగనబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట పట్టణ రోడ్డు విస్తరణలో నష్టపోతున్న చిరు దుకాణదారులను ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు విస్తరణలో భాగంగా చిరువ్యాపారుల దుకాణాలు, మెకానిక్ షాపులు తొలగిస్తున్న నేపథ్యంలో తిరిగి షెడ్డులు నిర్మించుకునేం దుకుస్థలాలు కేటాయించాలని, ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, నాయకులు ఒగ్గెల అర్జున రావు, చీపుర్ల సత్యావతి, సూర్యకుమారి, రసూల్, జలాల్, జబ్బార్, సయ్యద్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిల నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు

మణుగూరుటౌన్: మండలంలోని రామానుజవరం, వయా గొల్లకొత్తూరు, పగిడేరు గ్రామాలను కలిపే వాగులపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.50 కోట్లు శనివారం మంజూరయ్యాయి. ఇటీవల వరదలకు దెబ్బతిన్న చప్టాల స్థానంలో హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ, మండల ప్రజల తరపున మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

22న ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

మణుగూరుటౌన్: ఈ నెల 22న పీవీకాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సింగరేణి డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మాత రిసర్చ్ ఆఫ్ ఆయుర్వేద వైద్యలయానికి చెందిన సీనియర్ వైద్యులు విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు.

సీతాయిగూడెంలో వైద్యశిబిరం

చంద్రుగొండ: మండలంలోని సీతాయిగూడెం గ్రామంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక రోగులను పరిశీలించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హారిక, నాగజ్యోతి, భవాని, ఆశాకార్యకర్తలు నారాయణమ్మ, పద్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి

ములకలపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మండల కార్యదర్శి వర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. సమావేశంలో ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, గడ్డం వెంకటేశ్వర్లు, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు ఇవ్వకుంటే ఆందోళనే..

చర్ల: ఆదివాసీలకు కుల ధృవపత్రాలను వెంటనే జారీ చేయకపోతే ఆందోళన నిర్వహిస్తామని ఆదివాసీ యువజేన అధ్యక్షుడు మడకం చందు అధికారులను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని సంతపాకల్లో జరిగిన ఆదివాసీ యువసేన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన వారికి కుల ధృవపత్రాలను జారీ చేసిన అధికారులు కొంత కాలం నుంచి అర్ధాతరంగా నిలిపివేశారని, జారీని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ యువసేన నాయకులు పొడియం కోసయ్య, భద్రయ్య, రఘు, ఉంగయ్య, మడకం రాజు, గంగయ్య, లక్ష్మయ్య, ఉంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగు లాభదాయకం


జగ్గారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ కేశవరావు

దమ్మపేట: మునగ పంట సాగు రైతులకు చాలా లాభదాయకంగా ఉంటుందని, మండలంలోని పట్వారిగూడెం సెక్టార్ వ్యవసాయ శాఖ ఏఈఓ కేశవరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని జగ్గారం గ్రామంలోని గిరిజన రైతులకు, మునగ సాగుపై ఏఈఓ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునగ పంట సాగుపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సాగులో అవలంబించే పద్ధతులు, మెళకువలను సమగ్రంగా వివరించారు. సాగుపై రైతులు అడిగిన ప్రశ్నలకు సమాదానాలిచ్చారు. కార్యక్రమంలో రైతులు కారం శ్రీరాములు, మడివి బాలరాజు, సోయం వెంకటేశ్వరరావు, కారం వసంతరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్లు ఆవిష్కరణ

అశ్వారావుపేటరూరల్: మాలల మహాపాదయాత్రను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా కార్యదర్శి పల్నాటి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఈనెల 25వ తేదీన భద్రాచలంలో ప్రారంభం కానున్న మహాపాదయాత్ర డిశంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో ముగుస్తుందని తెలిపారు. భారీగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.అల్లాడి రామారావు, గుమ్మళ్ల గోపి, అల్లాడి నాగరాజు, ముళ్లగిరి రాంబాబు పాల్గొన్నారు.

కుమురం భీంకు నివాళి

దమ్మపేట: ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మండల కేంద్రంలోని కొమమురం భీం విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. గోండు నాయకులతో కలసి నిజాం భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా భీం చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వగ్గెల పూజ, కొర్సా వెంకటేష్, బండారు సూర్యనారాయణ, కుంజా చినబాబు, పెనుబల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి


గుండాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

గుండాల: ఇల్లెందులోని ఓ విలేకరిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, గుండాల, ఆళ్లపల్లి మండలాల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత రెండు రోజుల క్రితం ఇల్లందు పట్టణ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడడం సరైంది కాదని, వారిని పట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు.

అధ్వానంగా ప్రధాన రహదారి


మొండికుంట–భద్రాచలం క్రాస్ రోడ్డు మధ్య అధ్వానంగా మారిన రహదారి

అశ్వాపురం: మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మొండికుంట నుండి సీతరాంపురం, గొల్లగూడెం, అశ్వాపురం, జగ్గారం, మిట్టగూడెం, కళ్యాణపురం మీదుగా మణుగూరు వరకు మణుగూరు కొత్తగూడెం ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. అంతా గుంతలమయమైంది. ఈ గుంతల్లో వాహనాలు అదుపు తప్పి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో మరింత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం ఇసుక లారీలు, బొగ్గు లారీలు, పరిశ్రమలకు సంబంధించిన భారీ వాహనాలు, బస్సులు, ప్రైవేటు వాహనాలు వందల సంఖ్యలో నిత్యం ప్రయాణిస్తుంటాయి. ఈ వాహనదారులంతా గుంతలమయమైన రహదారిపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యమే కీలకం


చంద్రుగొండ: విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జీఈసీఓ అన్నామణి


చర్ల: విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న ఎంఈఓ పీవీ రమణ

చర్ల: విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని, వారి చదువులపై తల్లిదండ్రులు దృష్టి ఉంచాలని మండల విద్యాధికారి పీవీ రమణ పేర్కొన్నారు. మండలంలోని తేగడలోని జిల్లా పరిషత్ హైస్కూల్, కలివేరులోని ఎంపీపీఎస్ స్కూళ్లలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను కల్పించిందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగుతోందని ఆయన చెప్పారు. మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు మరింతగా కృషి చేయాలని ఆయన కోరారు. సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని ఆయన తెలుసుకున్నారు. ఈ సమావేశాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పినపాక: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారి కె.నాగయ్య సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రధాన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో పాస్ పర్సంటేజ్ పెంచే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ శ్రీకాంత్ విద్యాంజలి, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించండి

చంద్రుగొండ: పిల్లలకు అర్థం అయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని లింగ సమానత్వ జిల్లా కోఆర్డినేటర్ (జీఈసీఓ) అన్నామణి ఉపాధ్యాయులకు సూచించారు.

చంద్రుగొండలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నూతన సాంకేతికతను ఉపయోగించుకుంటూ విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో, విద్యార్థినుల తల్లిదండ్రులతో వేర్వేరుగా ఆమె సమావేశమై వారి సూచనలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆమె వెంట విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ కవిత పాల్గొన్నారు.